

# నా పేరు పెట్టింది మీసాల సుబ్బరాజు

పెద్దాస్పత్రి అన్నమ్మ మా యింటికొచ్చి పురుడుబోస్తే నేను సుకంగా పుట్టేసినానుగానీ ఆనేక నా పేరు పెట్టడమే పెద్ద గలాటా అయిపోయిందంట. ఒక రోజు కాదు, రెండు రోజులు కాదు మొత్తం మూడు రోజుల రచ్చంటది. నాకిప్పుడు యిర్వై ఏడేళ్లొచ్చినాయిగానీ మా నాయిన రెండు వందల డెబ్బయి సార్లన్నా యీ కత చెప్పి మమ్మల్ని నవ్వించి వుంటాడు.

పాతశెట్టి కొట్టు కాణ్ణుంచి మూడీశల కలకండ తెచ్చి మంచి మద్యాన్నం పూట నట్టింట్లో గుమ్మరించి బోసినాడంట మా నాయిన.

ఆ రోజు శుక్కురోరం. మాకు మంచిరోజు.

'లడ్లు చేసేదానికి మిల్లుకాడ రాంకోటారెడ్డి డబ్బులివ్వలేదుగానీ దీన్నే సదరంగా గెడ్డలు కొట్టి పెట్టు. సాయింత్రం నేనొచ్చినాక పేరుపెట్టి తలా రొంత పంచేద్దాం' అన్నాడంట మా

నాయినమ్మతో.

నవారు మంచం మీద తలకు పట్కా కట్టుకోనున్న మా అమ్మ నాకు పాలిస్తా వుందంటగానీ మరేదకైనా తలెత్తి కలకండ తట్టు చూళ్లా.

చూసేం ఫాయిదనీ? ఏదన్నా మాట చెప్పబోతే యీ అమ్మా కొడుకులిద్దరూ చీమతో సమానంగా యిదిలించి పారేయబోతారని గమ్మున నాకు పాలిస్తా వుండి పోయిందంట.

'అదేందిరబయా! లడ్లు చేయకుండా బిడ్డకు పేరు పెట్టేది మనిళ్లల్లో వుందా? తొలి బిడ్డకు లడ్లు పంచి రెండో బిడ్డకు కలకండ పంచితే నామర్దా గదా' అనిందంట మా నాయినమ్మ- మొకాన్ని అయిదుపైసల బిళ్లంత చేసుకుంటా.

మా నాయినకు సర్రన ఎక్కింది కోపం.

'నువు పోయి తేపోమ్మే మీ తాత కాణ్ణుంచి లడ్లు! అవుతల మిల్లుకాడ పని కాలేదుమే అని ఒక తట్టు చెప్తా వుంటే- లడ్లకు డబ్బులేణ్ణుంచి వస్తాయా? యీసారికిట్టా గానీ. ఉయ్యాల్లో వేసేటప్పుడు గనంగా చేద్దాం' అన్నాడంట అన్నం తినేదానికి కూచుంటా.

మా నాయినమ్మ మళ్ల మాట్లాడకుండా సామాన్ల బుట్టలో నుంచి సుత్తి తీసుకుంటా కలకండ ముందు గొంతుకూచునింది.

'పేరేదన్నా అనుకున్నావా? వెతకమంటావా?' అనింది కలకండని గెడ్డలు కొడతా.

'నువు వెతికి పెట్టు. నేనొచ్చినాక ఖాయం చేద్దాం' అని, అన్నం తిన్నాక అదరాబదరాగా వెళ్లిపోయినాడు మా నాయిన.

ఆ పోవడం పోవడం సందేళదాకా పత్తాలా.

ఆరయ్యింది, ఏడయ్యింది, మనిషిరాడు.

'యీడు పనిలో పడితే దీన్‌దునియా తెలీకుండా పోద్దికదా. బిడ్డకు పేరుబెట్టే వేళయిపోతా వుందే' అని, గబగబా వజూ చేసుకొని పేరెతికేదానికి ఖురాను తెరిచింది మా నాయినమ్మ.

అప్పటిదాకా పట్టనట్టున్న మా అమ్మకు అనుమానం గెంట కొట్టింది.

'మ్మో! పేరుగావాలంటే మళ్లెప్పుడైనా పెట్టుకోవచ్చుగానీ ఆ మనిషి రాకుండా ఏమీ చేయబాకా! నాతో చెప్పకుండా చేస్తారా అని బొచ్చులు పగల్నాకి నీ మీది కోపం నా మీద తీర్చుకుంటే తట్టుకోలేను తల్లా' అని హెచ్చరించింది.

ముసిలామె వింటేగా?

ఖురాన్ని అటుతిప్పి యిటు తిప్పి ఆఖరకు పేరు పెట్టేసింది.

అంతటితో ఆగకుండా పక్కింటోళ్ల పిల్లోణ్ణి పిలిచి 'రే అబయా. నా మనవడికి మహమ్మద్ ఖదీర్ అహమద్ అని పేరు పెట్టినామని చెప్పి యీదిలో వాళ్లందరికీ కలకండ పంచిరాబో' అని ట్రే యిచ్చి పంపించేసింది. (మా అల్లాకు వున్న తొంబైతొమ్మిది పేర్లలో 'ఖదీర్' ఒకటి. అంటే 'సమర్థుడు' అని అర్థం).

వాడట్టా కదిల్నాడు. మా నాయినిట్టా దిగబడినాడు.

యింక చూడాలి. రావం దాడి.

'నేనొచ్చేతలికే ఏమా తొందరా? నేను సరే అనకముందరే పేరెట్టా పెట్టినావు. చెప్పు హరాం దానా! యింతకెట్టా తెగించినావు, కలకండెట్టా పంచినావు?' అని యింతెత్తు ఎగిరి, యింట్లో మిగిలున్న కలకండనంతా కాలితో తన్ని, మా నాయినమ్మని మూడు పగళ్లు మూడు రాత్రిళ్లు సాదిస్తా కూచున్నాడు మా నాయిన.

వాస్తవానికి మా నాయిన బాదంతా నాకు పేరు పెట్టినందుకు కాదు, యిట్టాంటి నోరు తిరగని పేరు పెట్టినందుకు. ఖదీర్‌లో 'ఖ'ని- 'ఖ' అనకూడదు. 'క' అనకూడదు. గొంతులో నీళ్లుపోసుకుని గరగరలాడిస్తామే- అట్లా అంటా 'ఖ' అని పలకాలా (ఎట్టా చెప్పేదిరా మౌలా).

మా బంధువుల పిలకాయల్లో నోరు తిరగని పేరు ఎవురికి పెడతా వున్నా మా నాయిన అడ్డం పడతా వుంటాడు. 'మన పేర్లు పలకలాక హిందువులు సస్తా వుంటారు. వాళ్లగ్గాడా నోరు తిరిగేట్టు పెడితే మీ సొమ్మేం పోద్దిమే' అని దబాయిస్తా వుంటాడు మా నాయిన. యిట్టాంటి నోరు తిరగని పేర్లుండబట్టే మా ఆడోళ్లకి పేర్లే లాకుండాపోయి 'బూబమ్మ', 'బీబీ'లయిపోయినారని అదేందో ఆయనకు నమ్మకం.

అంతదాకా ఎందుకా? మా నాయిన పేరు దస్తగిరి అహమద్. యింట్లో పిలిచే పేరు కరీముల్లా. మా కావలిలో కొత్తగా మా నాయిన కరెంటు పని మొదులుపెడతా స్నేయితులకూ రెడ్లకూ పలికేదానికి కష్టంగా వుందని చెప్పి 'కరీం'గా కత్తిరించేసుకున్నాడు. యిప్పుడు మావూర్లో 'కరీం' అంటేనే మా నాయిన తెలిసేది. 'కరీముల్లా', 'దస్తగిరి' అని అడిగితే మా పక్కింటోళ్లు కూడా 'ఆయినెవురు?' అంటా తెల్లమొకం వేస్తారు. అట్టాంటి పట్టింపున్న మనిషి ఆయనకు పుట్టినోడికి నోరు తిరగని పేరు పెడితే వూరుకుంటాడా?

మా నాయిన సాదింపు పళ్లేక 'దేవుడి పేరు పెట్టి కూడా యీ నస్లిహరామ్ గాడికి లోకువై పోయినానే... సరిగ్గా పిలవాలనుకుంటే యీ పేరు పలకడం కష్టమా? ఆ మాటకొస్తే

హిందువుల పేర్లన్నీ మన నోళ్లు తిరిగేటట్టే వున్నాయా? యీడి పెడ(దం నాశినంగాను' అని, మా నజీరత్త యింటికి దబ్కాయించేసి ఆణ్ణే నెల రోజుల పాటు వుండి పోయిందంట మా నాయినమ్మ.

అయితే అంతటితో కతయిపోలా.

ఇది జరిగిన నాలుగేళ్లకి- మా నాయిన నా పేరు గురించి ఎట్టయితే బాద పడినాడో మీసాల సుబ్బరాజయివోరు కూడా అట్టే బాదపడినాడంట.

సుబ్బరాజయివోరు మా యిద్యానికేతన్ కాన్మెంట్ కరెస్పాండెంటు. మా నాయినకు మంచి స్నేయితుడు.

'యిదేందయ్యో కరీం సాయిబా! యిట్టాంటి పేర్లన్నీ మా నోళ్లు తిరిగే దానికేనా?' అన్నాడంట ఆయన, రిజిస్టర్లో నా పేరు రాసే ముందు.

మా నాయిన మళ్లా ఒక దఫా బాద పడతా 'మా అమ్మ చేసిన పని భాయ్! ఏం చేసేది చెప్పు' అన్నాడు, ఏదో ఒక దోవ చూడవా అన్నట్టుగా.

మీసాల సుబ్బరాజయివోరు మీసం దువ్వుకుంటా కాసేపు ఆలోచించినాడు.

''ఒక పని చేద్దాం కరీంభాయ్. పేరు చివర్న 'అహ్మదు' తీసేసి 'బాబు' అని పెడదాం. 'ఖదీరు' నోరు తిరక్కపోయినా 'బాబు' అనయినా పిలస్తారు కదా'' అన్నాడు.

మా నాయిన మొకం చాటంతయ్యింది. 'అట్నే కానీ' అని ఆ(టైట్ చెప్పేసినాడు.

మీసాల సుబ్బరాజయివోరు 'శుబం' అంటా రిజిస్టర్లో నా పేరు రాసేసినాడు.

ఆనాటి నుంచి యీనాటిదాక అందరూ నన్ను 'ఖాదర్' అన్నా, 'ఖాధీర్' అన్నా, నా మార్కుల లిస్టులో 'కాదిర్' అని పడినా, మా మురళీ వాళ్ల చినమామ్మ నన్ను 'కదిరి' అని పిలిచినా 'బాబు' మాత్రం తప్పుల్లాకుండా అట్నే వుండిపోయింది.

అంతా మీసాల సుబ్బరాజయివోరి పుణ్యం.

